JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 12-06-2026
Medchal - Malkajgiri । Friday 12-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 11
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 11 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com





# ప్రధాని మోదీతో సీఎం రేవంత్ భేటీ

**దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ 6 మహానగరాల అభివృద్ధి కోసం రూ. 6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని సూచించారు. ఈ నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ఒక్కో నగరానికి రూ. 1 లక్ష కోట్ల చొప్పన అందించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతూ సమావేశంలో పలు ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కుల గణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను సమావేశంలో వివరించారు.**

**జయభేరి, న్యూఢిల్లీ:**

తెలంగాణ సమగ్రాభివృద్ధికి రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో 2వ దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో IIM ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశం ప్రగతి సాధించడానికి విద్య, వైద్యం బలమైన పునాదిగా నిలుస్తాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఉద్ఘాటించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి అని, ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో ఆర్థిక స్థితిగతులు, భూమి కంటే విద్య.. సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా వెల్లడైందన్నారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. ఈ ప్రాధాన్యత నేపథ్యంలోనే విద్యా శాఖను స్వయంగా తానే నిర్వహిస్తున్న విషయాన్ని, విద్యా రంగంలో తీసుకురావలసిన సంస్కరణలను ప్రస్తావించారు. "గడచిన 75 ఏండ్లలో ఉచిత

...మిగతాది 2 లో

## కేంద్ర ప్రభుత్వా సహకారం కావాలి

తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని చెప్పారు. నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ప్రధానమంత్రిని కలిసి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణతో పాటు పలు ప్రతిపాదనలను అందించారు. మెట్రో ఫేజ్-2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు ₹38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని గుర్తుచేస్తూ, ఎన్‌హెచ్‌ఏఐకి రూ. 626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం నిర్మాణం కూడా తెలంగాణ రాష్ట్రానికి అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, HMDA మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని, ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. "హైదరాబాద్ - అమరావతి - బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలి. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుంది. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుంది. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల

...మిగతాది 2 లో

# భారత రాజకీయాల్లో అరుదైన ఘనత

## ప్రధాని మోదీకి ప్రపంచ నేతల అభినందనలు



**జయభేరి, న్యూఢిల్లీ:**

భారత రాజకీయ చరిత్రలో మరో కీలక మైలు రాయిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధిగమించారు. వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా కొనసాగుతూ, స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నెలకొల్పిన రికార్డును మోదీ అధిగమించారు. ఈ ఘనతతో దేశ చరిత్రలో అత్యధిక కాలం నిరవధికంగా పదవిలో కొనసాగిన ప్రధాన మంత్రిగా ఆయన నిలిచారు. ఈ సందర్భంగా దేశ, విదేశాల నుంచి వచ్చిన అభినందనలకు ప్రధాని మోదీ స్పందించారు. గత కొన్ని రోజులుగా వివిధ రంగాలకు చెందిన ప్రజలు, నాయకులు పంపిన శుభాకాంక్షలు తనను ఎంతో కదిలించాయని తెలిపారు. ప్రతి సందేశానికి వ్యక్తిగతంగా స్పందించలేకపోయినా, అందరి ప్రేమాభిమానాలను హృదయపూర్వకంగా స్వీకరిస్తున్నానని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

...మిగతాది 2 లో

# కవితకు షాక్ తప్పదా?



- **టీఆర్ఎస్ పేరుపై వందల అభ్యంతరాలు**
- **అదే పేరుతో మరో రెండు పార్టీలు కూడా..**

**జయభేరి, హైదరాబాద్, జూన్ 11 :**

తెలంగాణ సెంటిమెంట్‌ను తిరిగి రగిల్చి, రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేయాలని తెలంగాణ రక్షణ సేన పేరుతో సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించిన కల్వకుంట్ల కవితకు ప్రారంభంలోనే ఊహించని చట్టపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత సొంతంగా రాజకీయ అస్తిత్వం కోసం కవిత ఈ కొత్త పార్టీని ప్రకటించారు. అయితే, భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రజాభిప్రాయం, అభ్యంతరాల కోసం పత్రికా ప్రకటన జారీ చేసిన తరుణంలో.. ఆమె ఎంచుకున్న TRS అనే సంక్షిప్త నామంపై ఈసీకి ఏకంగా 600 నుండి 700 వరకు భారీ సంఖ్యలో అభ్యంతరాలు రావడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వివాదాన్ని మరింత క్లిష్టంగా మారుస్తూ.. కవిత కంటే ముందే మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన తెలంగాణ రాష్ట్రసామాజిక సేన అనే మరో ప్రాంతీయ

...మిగతాది 2 లో

# యువతకు శుభవార్త

- **కొత్త పథకం.. రూ.25 లక్షల వరకు సాయం**



**జయభేరి, విజయవాడ, జూన్11 :**

ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే రాష్ట్రంలో విదేశీ విద్యా పథకాన్ని అమలు చేయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రకటించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విదేశాల్లో ఉన్నత చదువులు కొనసాగించలేకపోతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమైన ఈ పథకాన్ని ఇప్పుడు మరింత విస్తృతంగా అమలు

...మిగతాది 2 లో




# మల్కాజిగిరిలో మహిళ హత్య కేసు ఛేదన

- **గంటల్లోనే ప్రధాన నిందితుడి అరెస్ట్**
- **పిస్టల్, తూటాలు, కత్తులు స్వాధీనం**

**జయభేరి, మల్కాజిగిరి, జూన్ 11 :**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన దేశీయ తయారీ పిస్టల్, సజీవ తూటాలు, కత్తులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం. 479/2026 కేసు వివరాలను పోలీసులు వెల్లడించారు. మృతురాలు ధమరా నిశారాణి (35) కాగా, ప్రధాన నిందితుడు ఆమె భర్త ధమరా అరుణ్ కుమార్ (48). అతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మరో నిందితుడు హర్దిందర్ సింగ్ అలియాస్ హర్భజన్ సింగ్ పరారీలో ఉండగా, మిర్ ముజమ్మిల్ అలీ ఖాన్ (23) పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

**దాంపత్య విభేదాలే హత్యకు కారణం**

పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, అరుణ్ కుమార్ మొదట నిశారాణి అక్కను వివాహం చేసుకున్నాడు. అనంతరం నిశారాణిని వివాహం చేసుకున్నాడు. గత కొంతకాలంగా భార్య నిశారాణి ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న అరుణ్ కుమార్ తరచూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ వేధింపుల కారణంగా నిశారాణి పలుమార్లు మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని తన బంధువుల వద్ద ఆశ్రయం పొందినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల దాంపత్య కలహాలు మరింత తీవ్రరూపం దాల్చడంతో, జూన్ 10న సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో మారుతి నగర్‌లోని తన నివాసంలోనే నిశారాణిపై తుపాకీతో కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

**గతంలోనూ తుపాకీ కేసులో నిందితుడు**

అరుణ్ కుమార్ గతంలో అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం.134/2026లో అక్రమ తుపాకీ కలిగి ఉన్న కేసులో నిందితుడిగా ఉన్నట్లు విచారణలో తేలింది. ఆ కేసులో జ్యుడీషియల్ కస్టడీ అనంతరం విడుదలై తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబ కలహాలు మరింత పెరిగినట్లు పోలీసులు గుర్తించారు.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రధాని మోదీతో సీఎం రేవంత్ భేటీ

విద్య అందించేందుకు అందరూ ప్రయత్నించారు. కానీ నాణ్యమైన విద్యను అందించడం ఒక సవాలుగా మారింది. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టింది" అని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తెలంగాణలో నిర్మించే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు YIIRS కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా తెలంగాణలోని యంగ్ ఇండియా స్కూల్స్ సందర్శిస్తే సంతోషిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరం. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్నాం. టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందని అన్నారు. తెలంగాణ రైసింగ్ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని గుర్తుచేస్తూ, హైదరాబాద్ కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని దాని ఆవశ్యకతను వివరించారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

### కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలి

ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుంది" అని ప్రధానమంత్రికి వివరించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. "వరంగల్ విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణ ఇప్పటికే పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించాం. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత ప్రయోజనం చేకూరుతుంది" అని చెప్పారు. హైదరాబాద్‌లో IIM ఏర్పాటు చేయాలని కోరారు. "ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయి. ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యా విధానం 2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుంది" అని ప్రధానమంత్రికి వివరించారు.

### భారత రాజకీయాల్లో అరుదైన ఘనత

భారత్‌కు సేవ చేసే అవకాశం లభించడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానని మోదీ అన్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. స్థిరత్వం, సుపరిపాలన, అభివృద్ధి కోసం భారత ప్రజలు వరుసగా తన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం విశేషమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా పనిచేయడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. 'వికసిత్ భారత్' లక్ష్యసాధన కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని ప్రధాని స్పష్టం చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ చారిత్రక ఘట్టం చోటుచేసుకుంది. న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీఏ సమావేశంలో మాట్లాడిన మోదీ, ఒక రోజు ఈ రికార్డును సాధిస్తానని ఎప్పుడూ ఊహించలేదని చెప్పారు. ఈ సందర్భాన్ని ప్రత్యేకంగా మార్చిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అత్యంత శక్తివంతులని, ఇంతకాలం సేవ చేసే అవకాశం ఇవ్వడం వారి పరిపక్వతకు నిదర్శనమని పేర్కొన్నారు. మోదీ సాధించిన ఈ ఘనతపై ప్రపంచ నాయకుల నుంచి కూడా అభినందనలు వెల్లువెత్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మోదీని బలమైన, ఆరోగ్యవంతమైన, వివేకవంతమైన నాయకుడిగా అభివర్ణిస్తూ, ఆయనకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు దక్కాలని ఆకాంక్షించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా మోదీ నాయకత్వాన్ని ప్రశంసించారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించడం విశేషమని పేర్కొన్నారు. మోదీ పాలనలో కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడ్డారని ఆయన అన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రత్యేక వీడియో సందేశం ద్వారా మోదీకి అభినందనలు తెలిపారు. భారతదేశాన్ని కొత్త దిశగా నడిపించడంతో పాటు భారత్‌ఇజ్రాయెల్ సంబంధాలను మరింత బలోపేతం చేశారని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానాన్ని మోదీ సంపాదించుకున్నారని నెతన్యాహు పేర్కొన్నారు.

## మల్కాజిగిరిలో మహిళ హత్య కేసు ఛేదన

హత్య జరిగిన వెంటనే మల్కాజిగిరి పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర కీలక సమాచారాన్ని విశ్లేషించి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ క్రమంలో జూన్ 11న ఉదయం మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రధాన నిందితుడు అరుణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో ఒక దేశీయ తయారీ పిస్టల్, మూడు సజీవ తూటాలు ఉన్న మ్యాగజైన్, ఒక స్టెయిన్‌లెస్ స్టీల్ బటన్ నైఫ్, రెండు స్టెయిన్‌లెస్ స్టీల్ కత్తులు, ఒక సర్జికల్ బ్లేడ్, ఒక మారుతి బలెనో కారు, ఒక బజాజ్ చేతక్ స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, అడ్మిన్ జాయింట్ కమిషనర్ సి. శ్రీధర్, అదనపు డీసీపీ రామ్ కుమార్, ఏసీపీ వి. యాదగిరి రెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి. సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సి. శ్రీను, ఎస్ఐ బి. సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీనివాస్, పీసీలు ఎస్. యెల్లా స్వామి, ఎం. షాసూర్ బాబు తదితరుల ప్రత్యేక బృందం సమన్వయంతో కేసును ఛేదించింది. కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. కుటుంబ హింస, బెదిరింపులు, అక్రమ ఆయుధాల వినియోగం వంటి ఘటనలను వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100 / 112కు తెలియజేయాలని మల్కాజిగిరి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుటుంబ వివాదాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణనష్టం, ఆస్తి నష్టం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. అక్రమ తుపాకులు, ప్రాణాంతక ఆయుధాలను కలిగి ఉండటం, రవాణా చేయడం, వినియోగించడం వంటి చర్యలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమ ఆయుధాల సమాచారం, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికల గురించి పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# టాలీవుడ్ కు ఏమైంది



తెలుగు సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఏడాదిగా నిర్మాతకు నికరంగా లాభాలు మిగిల్చిన సినిమా లేదంటే అతిశయోక్తి కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాలు.. రిలీజ్ ఎప్పుడో తెలియని దుస్థితిలో ఉన్నాయి. దీంతో నిర్మాతకు రిలీజ్‌కు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఏడాది జరిగితే.. సీజీ వర్క్‌కు రెండుమూడేళ్లు తీసుకుంటూ.. ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. అంత టైమ్ తీసుకున్న సినిమాలు కూడా రిలీజయ్యాక.. సీజీ వర్కు బాగాలేదనే టాక్ తొలిరోజే బయటికొస్తోంది. ఇలా వందల కోట్ల బడ్జెట్లు.. ఏళ్ల తరబడి షూటింగులతో సినిమా రిలీజ్ కు ముందే నిర్మాతలు మునిగిపోతున్న దుస్థితి టాలీవుడ్‌లో కనిపిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. గడిచిన ఏడాదిలో అసలు హిట్ మాటే వినలేదంటున్నారు. ఇంకా మాట్లాడితే పుష్ప 2 తర్వాత నిర్మాతలకు నికరంగా డబ్బులు మిగిల్చిన సినిమా లేదని టాలీవుడ్ నిట్టూరుస్తోంది. సినీ పరిశ్రమలో చిన్న నిర్మాతలు ఎప్పుడో మునిగారు. పెద్ద నిర్మాతల స్థితి కూడా పైన పటారం. లోన లొటారంలా ఉంది. చివరకు అమెరికాలో సంపాదించిన డబ్బులతో సినిమాలు తీసే నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో మొదట్నుంచీ విజయాల శాతం తక్కువే. ఎన్నో లెక్కలు వేసుకుని.. ఎంతో జాగ్రత్తగా తీసే సినిమాలే ఆడతాయని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అలాంటిది అసలు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా.. గాల్లో లెక్కలు వేసుకుని తీసే సినిమాల గురించి చెప్పాల్సిన పనే లేదు.

మొదట్లో కథల ఎంపిక కోసం ఏళ్ల తరబడి చర్చలు జరిగేవి. ఒకసారి కథ తయారయ్యాక కూడా 24 విభాగాల వారి సలహాలు తీసుకునేవారు. అలా బాగా నలిగిన, మార్పులు చేర్పులు చేసిన కథనే తెరకెక్కించేవారు. అలాగే కథకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉండేది. కాంబినేషన్ల కోసం ఆరాటం, క్రేజ్ ఉన్న నటులే ఉండాలనే జంఝాటం ఏమీ ఉండేవి కాదు. పెద్ద హీరోలు అడిగినా కూడా.. ఈ కథ మీకు సరిపడదని నిర్మాతలు, దర్శకులు నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఎందుకంటే అప్పుడు కథే హీరో. సినిమాకే సింహాసనం. నటీనటులు, మిగతా వారికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ రోజుల్లో ఓ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కితే.. దాన్ని మిగతా భాషల్లోనూ డబ్ చేసేవారు. అప్పుడు డబ్బింగ్ రైట్స్ రూపంలోనూ డబ్బులొచ్చేవి. కొన్ని సినిమాలు నేరుగా పెట్టుబడి తేలేకపోయినా.. డబ్బింగ్ రైట్స్‌తో నిర్మాతలు గట్టెక్కిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. కాంబినేషన్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.తెలుగు సినిమాకు హంగులు, ఆర్భాటాలు చాలా ఎక్కువయ్యాయి.

మార్కెట్ కూడా పెరిగిందని కొన్ని హిట్ సినిమాల కలెక్షన్లు చూపించి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఏం మారినా.. విజయాల శాతం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఏటా వందల సినిమాలు రిలీజ్ కావడమే కానీ.. డబ్బులు తెచ్చే సినిమాలు మాత్రం కనిపించడం లేదు. అడపాదడపా హిట్టయ్యే సినిమాల గురించి చెప్పుకోవడమే కానీ.. రెగ్యులర్‌గా లాభాలు మాత్రం రావడం లేదు. ఇప్పటికే సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల ప్రభావం చూచాయగా కనిపిస్తూనే ఉంది. కాకపోతే నిర్మాతలు మాత్రం కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది కాబట్టి.. పైన పటారం.. లోన లొటారం స్థితిని మెయింటైన్ చేస్తున్నారు. అమెరికాలో 10 20 ఏళ్ల పాటు డబ్బులు సంపాదించుకుని.. ఆ డబ్బులు పెట్టి సినిమాలు తీస్తున్న ఎన్నారై నిర్మాతలు కూడా నిండా మునుగుతున్నారు. వీరు మొదట పరిమిత స్థాయిలో సినిమాలు తీసి.. కాస్త లాభం కనిపించగానే.. నలుగురైదురు హీరోలు, డైరక్టర్లకు అడ్వాన్సులిచ్చి అడ్డంగా బుక్కైపోతున్నారు.ఒకప్పుడు స్క్రిప్ట్ పూర్తయ్యాక, నటీనటుల డేట్స్ అన్నీ కుదిరితేనే దర్శకనిర్మాతలు సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేవారు. రానురానూ మార్పులు వచ్చాయి. షూటింగ్ మొదలయ్యే ముందు కూడా సన్నివేశాలు రాసుకుంటూ కూర్చోవడం వల్ల సినిమా వ్యయపెరిగిపోవడమే కాకుండా, నాణ్యతా దెబ్బతింటోందని సీనియర్ నటులు, రచయితలు వివిధ ఇంటర్వ్యూల్లో చెప్పారు.

స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మరింత మెరుగు కోసం చిన్న చిన్న మార్పులు చేసుకోవచ్చు కానీ, అప్పటికప్పుడు కొత్త సన్నివేశాలు రాయడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కొన్నిసార్లు కారణమవుతోంది. ఇక సృజనాత్మకత పేరుతో దర్శకులు వేయించే సెట్లు, అనవసర హంగులు, విదేశీ ప్రయాణాలు.. ఇవన్నీ నిర్మాణ వ్యయాన్ని తడిసి మోపెడు చేస్తున్నాయి. ఇవన్నీ నిర్మాతలపై మోయలేని భారం మోపి.. అంతిమంగా టాలీవుడ్‌కి తీరని నష్టం చేస్తున్నాయి. సినీ పరిశ్రమకు ఎవరో పని గట్టుకుని నష్టాలు తేవడం లేదు. స్వయంగా చిత్ర పరిశ్రమే చేజేతులా సంక్షోభాన్ని కొనితెచ్చుకుంటోంది. ఇప్పటికే సగం మునిగింది. కనీసం ఇప్పటికైనా మేలుకోకపోతే.. నిండా మునిగే ప్రమాదం లేకపోలేదు. అనారోగ్యకర పోకడల్ని మొదట్లోనే తగ్గించుకునే ప్రయత్నం చేస్తే.. పరిస్థితి ఇక్కడదాకా వచ్చేది కాదు. కానీ పెడ ధోరణుల్ని ట్రెండ్ గా, కొత్త తరహా మార్కెటింగ్ సూత్రాలుగా చెప్పుకుని అదే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఎవరైనా సీనియర్లు సలహాలివ్వబోయినా.. వినిపించుకోవడం లేదు.

అదేమంటే కాలం మారిందని చెబుతూ.. తెలుగు సినిమాని చేజేతులా చంపేయటానికి కంకణం కట్టుకున్నారు. కనీసం తెలుగు సినిమాల్ని ఓటీటీలు కూడా ఎందుకు కొనడం లేదని ఎవరూ ఆలోచించడం లేదు. ఇప్పటికైనా టాలీవుడ్ ఆత్మావలోకనం చేసుకోకపోతే.. రాబోయే రోజుల్లో తెలుగు సినీ పరిశ్రమ ఒకటుండేది అని చెప్పుకోవాల్సి వస్తుందేమో. అందుక ఇకనైనా ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునే ప్రయాస మానేసి.. అందరూ కలిసి సమష్టి బాధ్యత తీసుకుంటే కానీ.. తెలుగు సినిమా పరిశ్రమ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.

## ఈ నెలాఖరులో కరీంనగర్ నూతన కలెక్టరేట్
# సీఎం చేతుల మీదుగా ప్రారంభం

■ మంత్రి పొన్నం ప్రభాకర్

జయభేరి, కరీంనగర్ :

కరీంనగర్ జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మున్సిపల్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శాతవాహన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్మితమైన నూతన కలెక్టరేట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ జిల్లా అభివృద్ధికి పరిపాలనా కేంద్ర బిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో ప్రారంభమైన కలెక్టరేట్ నిర్మాణ పనులు వివిధ కారణాలతో పూర్తికాక నిలిచిపోయాయని, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రత్యేక చొరవ తీసుకుని



మిగిలిన పనులను వేగవంతం చేసి పూర్తిచేయించారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం సహకారంతో అన్ని ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వసతులు, పౌరులకు అనుకూలమైన సేవా వ్యవస్థతో కూడిన కలెక్టరేట్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని వెల్లడించారు. కలెక్టరేట్ ప్రారంభం అనంతరం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చి ప్రజలకు మరింత సులభంగా సేవలు అందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సుడా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో విస్తృత స్థాయిలో గ్రీనరీ, ల్యాండ్‌స్కేపింగ్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. పర్యావరణ హిత వాతావరణం, విశాలమైన కార్యాలయాలు, ప్రజలకు అందుబాటులో ఉండే సేవా వ్యవస్థతో ఈ కలెక్టరేట్ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వ కార్యాలయ సముదాయంగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంలో నూతన కలెక్టరేట్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కరీంనగర్‌ను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. జిల్లాను పరిశ్రమలు, పర్యాటకం, విద్య, వైద్య రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, లా కాలేజీ, ఫార్మసీ కాలేజీ ఏర్పాటు ద్వారా ఉన్నత విద్యా అవకాశాలు విస్తరించాయని చెప్పారు. గతంలో నిలిచిపోయిన విద్యా అభివృద్ధి కార్యక్రమాలకు కొత్త ఊపునిస్తూ మరిన్ని కోర్సులు, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో కరీంనగర్‌ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మెడికల్ కాలేజీని టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. నూతన కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్‌ను కూడా త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. మానేరు రివర్‌ఫ్రంట్ రెండో దశ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, డంప్‌యార్డు తరలింపునకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు.

## కవితకు షాక్ తప్పదా?

పార్టీ కూడా ఇదే TRS అనే సంక్షిప్త నామంతో గుర్తింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. కవిత నేతృత్వంలోని టీఆర్ఎస్ మే మొదటి వారంలో పత్రికా ప్రకటనలు ఇవ్వగా.. సోలాపూర్ ఆధారిత పార్టీ అంతకంటే ముందే ఏప్రిల్ చివరి వారంలోనే జాతీయ దినపత్రికలలో నోటిఫికేషన్ ఇచ్చింది. వీటికి తోడు, ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలో తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిక్ , 'తెలంగాణ రాజ్య సమితి అనే రెండు చిన్న పార్టీలు నమోదై ఉండటం కవిత వ్యూహాలకు పెద్ద బ్రేక్‌గా మారింది. మరోవైపు, ఈ వ్యవహారంలో భారత్ రాష్ట్ర సమితి కూడా అధికారికంగా రంగంలోకి దిగి ఈసీకి లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. గతంలో కేసీఆర్ నాయకత్వంలో 14 ఏళ్ల పాటు ఉవ్వెత్తున సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి తెలంగాణ రాష్ట్ర సమితి పేరే బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచింది. ఈ పేరు ప్రజల మనస్సుల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ఓటర్లలో ఇప్పటికీ బలంగా నాటుకుపోయి ఉందని బీఆర్ఎస్ నేతలు గుర్తు చేస్తున్నారు. కేవలం మూడేళ్ల క్రితమే తాము జాతీయ రాజకీయాల కోసం టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినప్పటికీ.. ఇప్పుడు హఠాత్తుగా అదే పేరును వేరే కొత్త శక్తులకు కేటాయిస్తే భవిష్యత్తు ఎన్నికల్లో ఓటర్లు తీవ్రంగా గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందని, తద్వారా తమ పొలిటికల్ మైలేజ్ దెబ్బతింటుందని గులాబీ దళం గట్టిగా వాదిస్తోంది. ఈసీ నిబంధనల ప్రకారం కూడా రిజిస్టర్డ్ పార్టీల పేర్లను పోలిన గుర్తులను, పేర్లను కొత్త పార్టీలకు ఇవ్వకూడదనే నిబంధనను వారు గుర్తు చేస్తున్నారు.ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయం కవిత రాజకీయ భవిష్యత్తును శాసించనుంది.

సాధారణంగా ఒకే రకమైన ఉచ్చారణ , ఒకే విధమైన అక్షరాలు ఉండి, ఓటర్లను అయోమయానికి గురిచేసేలా ఉంటే ఈసీ ఆ పేర్లను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది.

ఒకవేళ ఈసీ గనుక ఈ 700కు పైగా వచ్చిన అభ్యంతరాలను, ముఖ్యంగా బీఆర్ఎస్ వాదనను పరిగణనలోకి తీసుకుని TRS అనే అబ్రివియేషన్‌ను తిరస్కరిస్తే.. కవిత మళ్లీ మొదటికొచ్చి తన పార్టీ పేరును, లోగోను పూర్తిగా మార్చుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయం వేదికగా కవిత టీఆర్ఎస్ ఈజ్ బ్యాక్ అంటూ క్యాడర్‌లో జోష్ నింపేందుకు, రాష్ట్రవ్యాప్త జెండా పండుగలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ అభ్యంతరాల పర్వం ఆమెకు పెద్ద రాజకీయ అగ్నిపరీక్షగా మారింది.

## యువతకు శుభవార్త

చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా పేదరిక రేఖ (బీపీఎల్) కింద ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులందరికీ అవకాశాలు కల్పించేలా విధివిధానాలు రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎస్సీ విద్యార్థులతో పాటు ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు, ఈబీసీ తదితర వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులు కూడా ఈ పథకం ప్రయోజనాలను పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. గత ప్రభుత్వాల హయాంలో అమలైన పథకాలలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ, ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా పారదర్శక వ్యవస్థను రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. విదేశీ విద్య అవకాశాలు కేవలం ధనిక కుటుంబాల పిల్లలకే పరిమితం కాకుండా, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు కూడా అందుబాటులోకి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆర్థిక సహాయం విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు రూ.25 లక్షల వరకు సహాయం అందించనున్నట్లు సమాచారం. అదనంగా వారి నిర్వహణ ఖర్చుల కోసం మరో రూ.5 లక్షలు మంజూరు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ.20 లక్షల వరకు, కాపు మరియు ఈబీసీ వర్గాల విద్యార్థులకు రూ.15 లక్షల వరకు ఆర్థిక మద్దతు అందించే ప్రతిపాదన ఉంది. విదేశాల్లో పీజీ, ఎంబీబీఎస్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఆర్థిక అండగా నిలవడం ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంటోంది. ఇక విశ్వవిద్యాలయాల ఎంపిక విషయంలో కూడా కీలక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది.

గతంలో క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో టాప్50 విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన వారికి మాత్రమే ఎక్కువగా ప్రయోజనం లభించేది. అయితే కొత్త విధానంలో ప్రపంచవ్యాప్తంగా టాప్250 విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు కూడా ఆర్థిక సహాయం అందించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీంతో మరింత మంది విద్యార్థులు విదేశీ విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకునే అవకాశం కలుగనుంది. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో అమలైన అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి తరహాలో ఈ పథకాన్ని మరింత విస్తృతంగా అమలు చేసి, రాష్ట్రంలోని పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# బీఎల్ఏలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

■ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, తెలంగాణ ఇంచార్జి సచిన్ సావంత్

**యాదగిరిగుట్ట, జూన్ 11:**



టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్ల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,తెలంగాణ ఇంచార్జ్ సచిన్ సావంత్, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి పాల్గొని వారికి దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడంతో పాటు అనర్హుల పేర్లు తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై బీఎల్‌ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని,ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బీఎల్‌ఏలు క్షేత్ర స్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు,చిరునామా మార్పులు,పేరు,ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని,ఓటు హక్కు వినియోగంపైన ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు. సర్ పేరుతో కాంగ్రెస్ అనుకూల వర్గాలకు చెందిన ఓట్లర్లు తొలగించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, అందుకే బీఎల్‌ఏలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓట్ల చోరీతో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తుందని,బీజేపీ కుట్రలు తెలంగాణ రాష్ట్రంలో జరగవని తెలిపారు. అన్ని బూతులలో బీఎల్‌ఏలు బాధ్యతగా పనిచేయాలని, మోదీకి వచ్చే ఎన్నికల్లో గోరి కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

**జయభేరి, మేడ్చల్, జూన్ 11:**



మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని కండ్లకోయ పట్టణంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన 3వ వార్షికోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పెద్దల ఆధ్వర్యంలో కాలనీ వాసులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచే బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల మధ్య బొడ్రాయికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం దేవతను పూలతో సుందరంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు, పట్టణ పెద్దలకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ పెద్దలు మాట్లాడుతూ, బొడ్రాయి అమ్మవారి కృపతో గుండ్లపోచంపల్లి డివిజన్ ప్రజలందరూ పాడిపంటలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. పట్టణానికి ఎలాంటి దిష్టి, కీడు కలగకుండా, ప్రజలంతా ఐకమత్యంతో ప్రశాంతంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కండ్లకోయలో జరిగిన ఈ ఉత్సవాలకు మహిళలు, యువకులు, వృద్ధులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సముద్రాల హంసరాణి కృష్ణగౌడ్, రాజేందర్, తలారి వెంకటేష్, ఎంబీ రాజు, పెంటయ్య, శివ, శ్రీకాంత్, ప్రభాకర్, మహేందర్, బిక్షపతి, స్థానిక నాయకులు, వార్డు ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, పట్టణవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అశ్రు నయనాల మధ్య డాక్టర్ కంభం వెంకట్ రాజ్ అంత్యక్రియలు

■ నివాళులర్పించిన డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎంపీ ఈటల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్

**జయభేరి, మేడ్చల్, జూన్ 11:**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంభం వెంకట్ రాజ్ గురువారం తెల్లవారుజామున నగరంలోని తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలోని వారి వ్యవసాయ క్షేత్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అక్కడికి చేరుకుని డాక్టర్ వెంకట్ రాజ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియలు అశ్రు నయనాల మధ్య సాగాయి. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ డాక్టర్ కంభం వెంకట్ రాజ్ పూడూరు గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. గ్రామంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ఆయన మృతి పూడూరు గ్రామస్తులతో పాటు మేడ్చల్ మండల ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పూడూరు గ్రామంలో అభివృద్ధి, సేవా కార్యక్రమాలతో పాటు పూడూరు-కిష్టాపూర్ పేరుతో డివిజన్ ఏర్పాటుకు కూడా విశేషంగా కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు చిన్నంగి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, శామీర్‌పేట, పూడూరు సొసైటీ మాజీ చైర్మన్లు పెంట రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పీసరి శ్రీనివాస్ రెడ్డి, బాబు యాదవ్, దేవేందర్ రెడ్డి, సింగరేణి సుగుణమ్మ, దుద్దు సంజీవరావు, బండారి నరేందర్, మాజీ ఎంపీటీసీ సింగరేణి పోచయ్య, నీరుడి రఘు, బాల మల్లేష్, ఎల్లంపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి, ఎండీ ఆరిఫ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, సద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు కోలా వెంకటేష్, శేఖర్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, శేషి కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.





# దివ్యాంగులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 11:**

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని బీజేపీ నేత గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన యాదగిరిగుట్టలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాలలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించాలని,అర్హులైన వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. దివ్యాంగులకు ఉపాధి కల్పించేందుకు 90 శాతం సబ్సిడీతో రుణాలు అందజేయాలని కోరారు. దాదాపు 32 అంశాలను మేనిఫెస్టోలో పెట్టినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేదంటే దివ్యాంగులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# ప్రైవేట్ లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 11 :**

యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రైవేట్ లాడ్జిలో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాదగిరిగుట్టకు వచ్చిన సూరి కృష్ణకుమార్ (71) అనే వ్యక్తి యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీలక్ష్మి నరసింహ లాడ్జిలో బుధవారం రూమ్ తీసుకున్నాడు. గురువారం సాయంత్రం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించారు. రూమ్‌లోని వ్యక్తి ఎంతకూ బయటకు రాకపోవడంతో స్థానికులు తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడు హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన గుర్తించినట్లు తెలిపారు.

# తండ్రి ప్రాణాలు తీసిన నాటుకోడి కూర

**జయభేరి, జనగామ :**

నాటుకోడి విషయంలో తలెత్తిన గొడవ లో వ్యక్తి మృతి చెందాడు. కోడికూర ఘర్షణలో తండ్రిపై కొడుకు రోకలిబండతో దాడికి దిగాడు. తండ్రి రమేష్ తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి గ్రామంలో ఘటన జరిగింది. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో నాటుకోడి తెచ్చి భార్యను కూర వండమని రైతు జంగిలి రమేష్ చెప్పాడు. రాత్రి అవుతుంది వద్దని భర్తకు భార్య నచ్చచెప్పింది. దాంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తన తల్లిని ఎందుకు తిడుతున్నావని తండ్రిని కుమారుడు గణేష్ ప్రశ్నించాడు. నన్నే ప్రశ్నిస్తావా.. అంటూ కొడుకు గణేష్ ను చంపపై తండ్రి రమేష్ కొట్టాడు. క్షణికావేశానికి గురైన గణేష్ పక్కనే ఉన్న రోకలిబండతో తన తండ్రిపై తలపై దాడి చేసాడు. తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయిన రమేష్ . ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.



# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం

■ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 11 :**

ఆలేరు నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆయన నివాసంలో ఆలేరు నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలలో కల్యాణలక్ష్మి ముఖ్యమైన పథకమని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కొంత భరోసాగా నిలుస్తుందని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో కొనసాగుతున్నాయని,ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 11 :**

తుర్కపల్లి మండలానికి చెందిన 59 కళ్యాణ లక్ష్మి చెక్కులను గురువారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న పథకాల్లో కళ్యాణ లక్ష్మి ఒక ముఖ్యమైన పథకమని అన్నారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కుమార్తెల వివాహ సమయంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసాను కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా ప్రచార కార్యదర్శి భూక్య రాజారాం నాయక్, సర్పంచులు శివరాత్రి లావణ్య జహంగీర్, దొనికని రేణుక వెంకటేష్ యాదవ్ ,తునికి లక్ష్మీరామిరెడ్డి, సోమల వెంకటేశం, బానోతు బుల్లి వీరన్న నాయక్, కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, జేరిపోతుల కరుణాకర్, కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, బొత్త రాములు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బిల్యా నాయక్ తండాలో బడిబాట కార్యక్రమం



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 11 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం బిల్యా నాయక్ తండాలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను, ప్రైవేటు పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాలలో ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తున్నందున ప్రైవేట్ పాఠశాలలకు పంపి తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేశ శ్రీనివాసాచారి, బండి మధుకర్, భూక్య గోవింద్ పాల్గొన్నారు.

# బుషిపాక శ్రీకాంత్ మృతి బాధాకరం

■ 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం అనాజిపురం గ్రామానికి చెందిన బుషిపాక శ్రీకాంత్ మృతి బిఆర్ఎస్ పార్టీ కి తీరనిలోటు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం శ్రీకాంత్ మృతదేహాన్ని పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం వారి భార్య శశికళ ఇద్దరు చిన్నపిల్లలను చూసి కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....బుషిపాక శ్రీకాంత్ మృతి బాధాకరం అని ఆయన అన్నారు.ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ చింతపల్లి మండల మాజీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బుషిపాక అనిత మొగులయ్య ,దేనియ తండా గ్రామ సర్పంచ్ కొండల నాయక్,ఎండి ఖాలేద్, నరసింహ,కొండల్ రెడ్డి, శ్రీకాంత్,శేఖర్ రెడ్డి,ప్రశాంత్, రవి, రమేష్,సందీప్ తదితర బిఆర్ఎస్ బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుడిపల్లి మండల అభివృద్ధికి మరో కీలక అడుగు

- ఎమ్మెల్యే బాలు నాయక్
- సమీకృత మండల కార్యాలయాల సముదాయానికి రూ.15 కోట్ల మంజూరు
- రైతుల సంక్షేమానికి నిదర్శనం గుడిపల్లిలో వరి కొనుగోళ్లలో 66 శాతం పెరుగుదల



**జయభేరి, దేవరకొండ :**

గుడిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయాల సముదాయం కోసం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ కార్యాలయ సముదాయానికి తెలంగాణ ప్రభుత్వం రూ.15 కోట్ల పరిపాలనా మంజూరు జారీ చేయడం గుడిపల్లి మండల ప్రజలకు శుభపరిణామమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెండు అంతస్తుల్లో అత్యాధునిక సౌకర్యాలతో ఈ భవనం నిర్మించబడుతుందని, మండలానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.

నూతనంగా ఏర్పడిన మండలాలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఈ సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన G.O టి.ఆర్.&బి శాఖ - భవనాల విభాగం - నల్గొండ జిల్లా, గుడిపల్లి (వి & ఎం) లో సమీకృత మండల స్థాయి కార్యాలయ సముదాయం నిర్మాణం - పరిపాలనా మంజూరు - ఆదేశాలు జారీ. రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ జి.ఓ.ఆర్.టి.నెం. 88 సి.ఇ. (ఆర్ & బి) భవనాలు, హైదరాబాద్ వారి లేఖ నెం. CE/B/DEE2/Nalgonda/Gudipally/IMLOC/ ప్రధాన ఇంజనీర్ (ఆర్ & బి), భవనాలు, హైదరాబాద్ నివేదించిన పరిస్థితులను పరిశీలించిన అనంతరం, నల్గొండ జిల్లా గుడిపల్లి (వి & ఎం) లో సమీకృత మండల స్థాయి కార్యాలయ సముదాయం నిర్మాణ పనికి రూ. 1500.00 లక్షల (రూ. 15 కోట్లు) పరిపాలనా మంజూరు ప్రభుత్వం మంజూరు చేయుచున్నది. మంజూరు చేయబడిన వ్యయం క్రింది ఖాతా శీర్షికకు జమ చేయబడును. 4059 - ప్రజా పనులపై మూలధన వ్యయం, 01 - కార్యాలయ భవనాలు, MH051 - నిర్మాణం, GH25 - రాష్ట్ర రంగ పథకాలు, SH (14) - రహదారులు, భవనాల శాఖ కోసం భవనాల నిర్మాణం, 530 - ప్రధాన పనులు, 531 - ఇతర వ్యయం. ఈ విషయమై ప్రధాన ఇంజనీర్ (ఆర్ & బి), భవనాలు, హైదరాబాద్ అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవలెను.

ఈ ఆదేశాలు ఆర్థిక శాఖ (EBSX) వారి సమ్మతితో, యు.ఓ. నెం. 3449105/607/A1/EBS.X/2025, తేదీ: 16122025 ప్రకారం జారీ చేయబడినవి. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ వారి ఆదేశాల మేరకు వికాస్ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వం ప్రధాన ఇంజనీర్ (ఆర్ & బి), భవనాలు, హైదరాబాద్. పనులు, ఖాతాల డైరెక్టర్, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్. ఆర్థిక శాఖ (EBSX), తెలంగాణ సచివాలయం, హైదరాబాద్. మంత్రి (ఆర్ & బి) పి.ఎస్.కు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పి.ఎస్.కు, టి.ఆర్.&బి శాఖ. ఎస్.ఎఫ్./ఎస్.సి. గుడిపల్లి మండల రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం ఫలితంగా వరి కొనుగోళ్లలో గణనీయమైన పెరుగుదల నమోదైందన్నారు. గుడిపల్లి PACS పరిధిలో 202425 సంవత్సరంలో 29,281 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయగా, 2025, 26 సంవత్సరంలో 48,637 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరిగిందని, ఇది గత సంవత్సరంతో పోలిస్తే 66 శాతం పెరుగుదలఅని వెల్లడించారు.

అదేవిధంగా దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వరి కొనుగోళ్లు లక్ష మెట్రిక్ టన్నులకు పైగా కొనసాగుతున్నాయని, రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గుడిపల్లి మండల అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవల అందుబాటు లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రయివేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేయాలి
- ఎస్సీ విద్యార్థి సంఘం డిమాండ్
- రాష్ట్ర నాయకులు పంతం విజయేందర్, వెలిశాల శ్యామ్

**జయభేరి, తొర్రూర్, జూన్ 11 :**

పట్టణ కేంద్రంలో ఎస్సీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్, రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపార వస్తువుగా మార్చుకొని అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని ఈ వసూళ్లపై ప్రభుత్వ అధికారులు మౌనం వహిస్తున్నారని అన్నారు. ఫీజు నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోలేకపోవడం వల్ల ప్రవేట్ పాఠశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తున్నారని పాఠ్యపుస్తకాల పేరుతో నోట్ బుక్స్ పాఠశాలలోనే అమ్ముతూ వ్యాపార దందా చేస్తున్నారు.ఈ ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రయివేట్ పాఠశాలపై ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేసి నిర్దిష్టమైన ఫీజు మెనూ పెట్టాలని కోరారు.పాఠశాలలో పుస్తకాలు, నోట్ బుక్స్ స్టేషనరీ అమ్మకాలను పూర్తిగా అరికట్టాలని పాఠశాలలను పుస్తకాలు అమ్మే పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్, శ్రీనివాస్, నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న పరకాల సెంటర్లు

- లక్కం శంకర్, కాంగ్రేస్ సీనియర్ నాయకులు
- ఆర్అండ్బీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం
- మెయిన్ రోడ్డు లన్ని గుంతలమయం




**జయభేరి, పరకాల, జూన్ 10:**

పరకాల పట్టణంలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన లోతైన గుంతలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్కం శంకర్ ఆరోపించారు. పాత ఏటీఎం సెంటర్, బస్టాండ్ సెంటర్, హుజూరాబాద్ రోడ్డులోని పోచమ్మ గుడి సమీపంలో మెయిన్‌రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మూలమలుపులు ఉన్న ప్రాంతాల్లో రోడ్డుపై లోతైన గుంతలు ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందన్నారు. పరకాల నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరుతో చెరువులు, కుంటలు, గుట్టలపై దృష్టి సారిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రధాన రహదారుల సమస్యలను మాత్రం విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే గుంతలను పూడ్చి రహదారులను మరమ్మతు చేయాలని ఆర్అండ్బీ శాఖ అధికారులను ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

## సిబ్బంది అందరూ అంకితభావంతో పని చేయాలి



**జయభేరి, పరవాడ:**

పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి డా. హైమావతి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రోగులను ఏ విధంగా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నది, హెల్త్ యాప్ ఏ విధంగా నిర్వహిస్తున్నది,స్టాప్ డయేరియా ప్రోగ్రాం అమలు మొదలగు విషయాలు పరిశీలించారు. అనంతరం ఫార్మసి, ల్యాబ్, వార్డ్ తనిఖీ చేయడం జరిగినది.రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. సిబ్బంది అందరూ అంకితభావంతో పని చెయ్యాలని ఈ నెల జూన్ 28 తారీకున జరుగు పల్స్ పోలియో ప్రోగ్రాం కి 05 సవత్సరాల పిల్లలకి పోలియో చుక్కలను అందించాలని ఆమె తెలియజేసారు. ఈ సమావేశంలో డా. హారిక, డా. జయశ్రీ కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్. ఎస్.సాయిరాం పి. హెచ్.ఎన్ జానకి రామన్ సూపర్వైజర్ ఎమ్మెస్ ప్రసాద్, స్టాప్ నర్స్ చైతన్య, ఫార్మాసిస్టు విజయకుమారి, ఎల్.టి అన్నపూర్ణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వీఎం, ఎయిమ్స్ ఆస్పత్రులకు బస్సులు నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు బీజేపీ నేతల వినతి




**జయభేరి, మేడ్చల్, జూన్ 11:**

పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో వంటిమామిడిలోని ఆర్వీఎం హాస్పిటల్ మరియు బీబీనగర్‌లోని ఎయిమ్స్ హాస్పిటల్‌లకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ మేడ్చల్ నాయకులు మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మేడ్చల్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య సేవల కోసం ఆర్వీఎం, ఎయిమ్స్ ఆస్పత్రులకు అధిక సంఖ్యలో వెళ్తున్నప్పటికీ, సరైన రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు పొందే ఈ ఆస్పత్రులకు చేరుకోవడానికి బస్సు సౌకర్యం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఆయన స్పందించిన తీరు పట్ల బీజేపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు ప్రజా ప్రతినిధులు, ప్రజా క్షేత్రంలో పనిచేసే నాయకుల సూచనలను పెడచెవిన పెడితే సంస్థల విశ్వసనీయత దెబ్బతిని ప్రజల నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సి.హెచ్. శ్రీనివాస్ గౌడ్, జాకట్ ప్రేమ్ దాస్, మహేష్ (మేడ్చల్ ప్రధాన కార్యదర్శులు), కార్యదర్శి విష్ణుమూర్తి గౌడ్, వంశీధర్ రెడ్డి, జిల్లా బీజేవైఎం కార్యదర్శి రాఘవ రెడ్డి, గొప్ప నాగరాజు, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలు

- ఉపాధ్యాయుడు కే. శంకర్ పెద్ద రాజమూర్ లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట



**జయభేరి, దేవరకద్ర :**

ప్రభుత్వ పాఠశాలలోనే ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుందని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కే. శంకర్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం పెద్ద రాజమూర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ఉపాధ్యాయుడు కే. శంకర్ మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలోనే చేర్పించాలని ఆయన గ్రామస్తులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంద న్నారు.

అంతే కాకుండా అనుభవం, అధిక అర్హత కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉంటారన్నారు. అదేవిధంగా పాఠశాలలో డిజిటల్ కంప్యూటర్ ద్వారా (ఏఐ)ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన కూడా జరుగుతుందన్నారు. ఆటలు, పాటలు, కథల ద్వారా బోధన జరుగుతుందన్నారు. స్వేచ్ఛపూరిత వాతావరణం లో విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేని చదువు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులందరూ గమనించాలన్నారు. కావున ప్రభుత్వ పాఠశాల ఉండగా.. ప్రవేట్ పాఠశాల ఎందుకు దండగ.. అని ఆయన అన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఆయన గ్రామస్తులు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను ఉపాధ్యాయులకు గుర్తించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అంజమ్మ, స్వప్న గ్రామ పెద్దలు, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్ర అవగాహన



**జయభేరి, మేడిపల్లి :**

టీపీసీసీ ఆదేశాల మేరకు, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన మేడ్చల్ నియోజకవర్గ BLAల అవగాహన, శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించబడింది, ముఖ్య అతిధులుగా హాజరైన బసవరాజు శ్రీనివాస్, గజ్జెల కాంతం. ఈ సందర్భంగా BLAల బాధ్యతలు, ఓటరు జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల వివరాల సవరణ, పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై నాయకత్వం దిశానిర్దేశం చేసింది. శిక్షణ శిబిరంలో పాల్గొన్న పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో BLAలు కీలక పాత్ర పోషిస్తారని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి, భాస్కర్, కృష్ణ గౌడ్, కవిడె కుమార్, కె. వి గౌడ్, వంగూరి పరమేష్, మహ్మద్ మజర్, నాగరాజు, శరత్ గౌడ్, కపిల్, మహిళా అధ్యక్షురాలు దుర్గా, మున్సిపల్ చైర్మన్ లు, మున్సిపల్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మీనాక్షీ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యంపై దాడి

- టి పి సి సి రాష్ట్ర ఓబిసి వైస్ చైర్మన్ రాజమూరి శ్రీనివాసులు

**జయభేరి, దేవరకద్ర :**

మధ్య ప్రదేశ్ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ ను తిరస్కరించడం వెనుక భారతీయ జనతా పార్టీ కుట్ర ఉందని టిపిసిసి రాష్ట్ర ఓబిసి వైస్ చైర్మన్ రాజమూరి శ్రీనివాసులు ఆరోపించారు. దేవరకద్రలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వారిపై క్రిమినల్ కేసులు నమోదు కాలేదని, రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కుతూ, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులను వేధించడం బి జె పి కి అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో బిజెపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రాజమూరి శ్రీనివాసులు హెచ్చరించారు.

## మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా నల్లమద్ది మాధవి యుగంధర్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం దేవరకద్ర మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా 1వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి నల్లమద్ది మాధవియుగంధర్ రెడ్డిని గురువారం మున్సిపాలిటీ మరియు మండల బీఆర్ఎస్ పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆ పార్టీ దేవరకద్ర మండలం మాజీ అధ్యక్షులు జెట్టి నరసింహా రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా జెట్టి నరసింహారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తరపున 1వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన మాధవి యుగంధర్ రెడ్డి మున్సిపాలిటీలోని 1వ వార్డు సమస్యలతో పాటుగా బీఆర్ఎస్ పార్టీ తరపున మున్సిపాలిటీలోని ప్రజలందరి తరపున తన గళం గట్టిగా వినిపిస్తారని పార్టీ ఫ్లోర్ లీడర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రజా సమస్యలపై పోరాటం చేస్తారని ఆశిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నల్లమద్ధి మాధవి యుగంధర్ రెడ్డి కి జెట్టి నరసింహారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజలకు చేరువలో ప్రభుత్వ ఆసుపత్రి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్న సేవలు
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

**జయభేరి, పరకాల, జూన్ 11:**



పరకాల పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన మౌలిక వసతులతో త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాలలో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్, పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా రూ.79.18 లక్షల వ్యయంతో వైద్య పరికరాల కొనుగోలు, అత్యవసర మందుల నిల్వలు, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు.

ప్రస్తుతం ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల సంఖ్య, ప్రతిరోజూ వైద్య సేవల కోసం వచ్చే రోగుల వివరాలు, నెలవారీ ప్రసవాలు, శస్త్రచికిత్సల సంఖ్య, మందుల నిల్వలు, నూతన ఆసుపత్రికి అవసరమైన అదనపు పరికరాలు, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల గణాంకాలు, ఆసుపత్రి పరిధిలోని మండలాల వివరాలను ఎమ్మెల్యే సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. బిల్లులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై సూపరింటెండెంట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పరకాల ఏరియా ఆసుపత్రి ద్వారా ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా అనస్థీషియా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన అన్ని మందులు ఆసుపత్రిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. గత నెలలో నూతన ఏరియా ఆసుపత్రిని సందర్శించి, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన ప్రతి రశీదు, బిల్లు, రికార్డును పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనులను సంబంధిత ఏజెన్సీలు వేగవంతంగా పూర్తి చేసి ఆసుపత్రిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా పరకాలలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవన సముదాయం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు.



## ఉద్యమకారులకు ప్రశంస పత్రం

**జయభేరి, ఎల్బీనగర్ :**

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా. కాచం సత్యనారాయణ చేతుల మీదుగా తెలంగాణ ఉద్యమకారుడు, జయభేరి దినపత్రిక ఎడిటర్ మోతే రఘు తిరుపతిరెడ్డి ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం అందజేస్తానన్న పథకాలను అందరికీ అందేలా.. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ కాచం సత్యనారాయణ చొరవ తీసుకోవాలని కోరారు.



## రైతులకు మీటర్లు పెట్టే పరిస్థితి వస్తే ఎన్నికల్లో పోటీ చేయను

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ స్పష్టీకరణ

**జయభేరి, దేవరకద్ర :**

రైతులకు మీటర్లు పెట్టే పరిస్థితి వస్తే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేయనని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) స్పష్టం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు అంటూ ప్రతిపక్షాల దుష్ప్రచారం చేస్తున్నారన్నారు, ఈ తప్పుడు ప్రచారాలను రైతులు నమ్మొద్దని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. రైతు డిస్కం ద్వారా వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్తు అందజేస్తామని ఖమ్మం జిల్లా పాలబండలో ఉప ముఖ్యమంత్రి చెప్పడం జరిగిందన్నారు. ఉచిత కరెంటు కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

## నేడు దేవరకద్ర ఎమ్మెల్యే పర్యటన



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) శుక్రవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2k రన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటారు. అలాగే ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కూడా హాజరవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## మొయినాబాద్ జంట హత్యల కేసులో
# నయవంచకురాలు మృతి

- 24 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- ఈ కేసులో ఇద్దరి పోలీసులపై వేటు
- ఇద్దరు మహిళల దారుణ హత్య
- అప్ప తిరిగి ఇవ్వమని అడిగితే ప్రాణాలు తీశారు
- డబ్బులిస్తామని నమ్మించి రప్పించిన దుండగులు
- మోయినాబాద్, చేవెళ్ల ఫార్మ్‌హౌస్‌లలో ఘాతుకం
- హత్య చేసి మృతదేహాలను పూడ్చిపెట్టిన వైనం
- రికవరీ సొత్తులో చేతివటం ??

**జయభేరి, హైదరాబాద్ :**







తమ అవసరాల కోసం ఇద్దరి దగ్గరి బంధువుల వద్ద అప్పు తీసుకొని తిరిగి అప్పు తిరిగి ఇవ్వమని అడిగినందుకు నమ్మించి నయవంచనకు పాల్పడి ఇద్దరి మహిళలను దారుణ హత్య చేసిన ప్రధాన నిందితురాలు కరీమా బీ పోలీస్ కస్టడీలోయాసిడ్ తాగి 24 రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూశారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు పోలీసులపై ఇప్పటికే వేటు వేశారు. ఇదిలా ఉండగా ఆత్మహత్యకు పాల్పడిన కరిమాబి చావు బతుకుల్లో ఉండగా నిమ్స్ ఆస్పత్రిలో కూకట్ పల్లి మెట్రోపాలిటన్ జడ్జి ముందు మరణ వాంగ్మూలం రికార్డు చేయడం జరిగింది. ఈ మరణవాంగ్మూలంలో కరిమాబి తాను తప్పు చేశానని అందుకే ఇక బ్రతక కూడదని, దీంట్లో ఎవరి ఒత్తిడి లేదని జడ్జి ముందు పేర్కొన్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా మొయినాబాదులో చోటుచేసుకుంది. తీవ్ర కలకలం రేపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాసింపూర్ గ్రామానికి చెందిన అబేదా బేగం (60) అంగన్వాడి ఆయాగా పని చేస్తూ ఈనెల 5 వ తేదీన ఇంటి నుండి అదృశ్యమైంది. ఎక్కడ ఆచూకీ లభించక పోవడంతో ఈనెల 10న బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తాండూర్ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన మహబూబ్ బి (58) ఈనెల 9వ తేదీన అదృశ్యమైంది. దీంతో వారి కుటుంబ సభ్యులు మహబూబ్ బీ తప్పిపోయిందని ఈనెల 10న యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేర్వేరు పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుల దర్యాప్తు చేపట్టిన తాండూరు రూరల్ పోలీసులకు తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలని లో నివసిస్తున్న భార్యాభర్తలు రెహమాన్ కరిమా బేగమ్‌ల పై అనుమానం వచ్చింది. దీంతో తమదైన శైలిలో విచారించిన తాండూరు పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు బయటపడ్డాయి. అప్పు తీసుకున్న ఇద్దరు భార్య భర్తలు రెహమాన్ (ఆటోడ్రైవర్), కరీమా బేగం లు ముందు వేసుకున్న పథకం ప్రకారం మొయినాబాద్ ఫామ్ హౌస్ లో పనిచేస్తున్న తన బావమరిది తో కలిసి అప్పిచ్చిన ఇద్దరూ వేర్వేరు మహిళలను నమ్మించి పిలిపించి, మొయినాబాద్, చేవెళ్ల లోని వేర్వేరు ఫార్మ్‌హౌస్‌లలో దారుణంగా హత్య హత్య చేసి అక్కడే పూడ్చిపెట్టారు. ఈ జంట హత్యల కేసు రంగారెడ్డి జిల్లా పరిధిలో తీవ్ర కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళలకు (60 ఏళ్ల పైబడినవారు) కొంతకాలంగా కొందరితో ఫైనాన్స్ (డబ్బుల) వ్యవహారంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బాధితులకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికిన నిందితులు, వారిని తాండూరు నుంచి ఇక్కడికి రప్పించారు.

బాధితులు ఇక్కడికి చేరుకున్న తర్వాత నిందితులు వారిని విడివిడిగా తరలించారు. ఒక మహిళను మోయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఫార్మ్‌హౌస్‌లో, మరో మహిళను చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంకొక ఫార్మ్‌హౌస్‌లో కిరాతకంగా హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మృతదేహాలను ఆయా ఫార్మ్‌హౌస్‌లలోనే గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టారు. మోయినాబాద్ పరిధిలోని ఫార్మ్‌హౌస్ నుండి ఇప్పటికే ఒక మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల పరిధిలోని ఫార్మ్‌హౌస్‌లో పూడ్చిపెట్టిన మరో వృద్ధురాలి మృతదేహాన్ని వెలికితీసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్లూస్ టీమ్, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా పోలీసులు కేసును వేగవంతం చేశారు. పోలీస్ అదుపులో ముగ్గురు నిందితులు ఉన్నారు. వారిలో రహిమాన్, మరో వ్యక్తి జైలు పాలయ్యారు

## చిరు వ్యాపారాలపైనే ఆధారపడి జీవనం



**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట పరిధిలోని R.G.K ప్రాంతంలో సుమారు 15 సంవత్సరాలుగా డబ్బాలు/చిరు వ్యాపార షాపులు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల సమస్యను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ ప్రాంతంలో సుమారు 1,779 కుటుంబాలు, దాదాపు 7,000 మంది జనాభా నివసిస్తూ, పూర్తిగా ఈ చిరు వ్యాపారాలపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. నిత్యావసరాల కోసం ఇతర జీవనోపాధి లేని పరిస్థితుల్లో, వారి షాపులను తొలగించవద్దని విజ్ఞప్తి చేస్తూ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) అధికారులు జేసీబీలతో షాపులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని విన్నవిస్తూ వ్యాపారులు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అనంతరం హన్మంతన్న వెంటనే స్పందించి, పై అధికారులతో మాట్లాడి చిరు వ్యాపారుల సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ గణేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఇగ్నైట్' పేరుతో కొత్త స్కామ్‌కు తెరలేపిన క్యూనెట్ నిర్వాహకులు

**జయభేరి, హైదరాబాద్, జూన్ 11 :**



హైదరాబాద్ పోలీసులు సుమారు రూ. 5,000 కోట్ల భారీ ఆర్థిక మోసాన్ని సకాలంలో గుర్తించి అడ్డుకున్నారు. 'ఇగ్నైట్' పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న మనీ సర్క్యులేషన్ నెట్‌వర్క్‌ను ఛేదించి, నలుగురు కీలక నిందితులను అరెస్టు చేశారు. అమాయక ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసేందుకు సిద్ధమైన ఈ ముఠా కుట్రను సీసీఎస్ పోలీసులు ముందే పసిగట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు. ఈ వ్యవహారంలో హైదరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్' పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. సదరు సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కేవలం 18 రోజుల్లోనే పోలీసులు రంగంలోకి దిగి, పెను నష్టం జరగకుండా నివారించడం విశేషం. గతంలో నిషేధానికి గురైన క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ నెట్‌వర్క్‌ల నిర్వాహకులే 'ఇగ్నైట్' పేరిట ఈ సరికొత్త మోసానికి తెరలేపినట్లు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) దర్యాప్తులో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలుగా ఈ ముఠా వరుసగా గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్‌నెట్, క్యూనెట్, తాజాగా ఇగ్నైట్ రూపంలో వివిధ పేర్లతో ప్రజలను వంచిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారీస్థాయిలో ప్రజలు ఆర్థికంగా నష్టపోకముందే ఇలాంటి మనీ సర్క్యులేషన్ రాకెట్లను గుర్తించి, వాటిని నిర్మూలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీపీ సజ్జనార్ వివరించారు.

## ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ఆవిష్కరణ

- పాల్గొన్న కవిత




**జయభేరి, హైదరాబాద్ :**

బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అవిష్కరించారు. కవిత మాట్లాడుతూ జులై 2న ఉప్పల్ భగాయత్ భూములు స్వాధీనం చేసుకుంటాం. ఉద్యమకారుల భూపోరాటానికి అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలి. జులై 2న ఉప్పల్ భగాయత్ లో భూపోరాటం చేసి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఉద్యమకారులకు 250 గజాల భూమి ఇచ్చే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వెంటనే ఉద్యమకారులను గుర్తించి వారికి ఇస్తామన్న భూమి ఇవ్వాల్సిందే. మరో మారు కొంతమంది వ్యక్తులు, శక్తులు తెలంగాణవాదం మీద దాడి చేస్తూ తెలంగాణ స్ఫూర్తిని దెబ్బ తీసే కుట్ర చేస్తున్నారు. అందుకే వాళ్ల కుట్రలను తిప్పికొట్టేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం మనందరి చారిత్రక కర్తవ్యం. ఉద్యమకారులకు మంచి జరగాలని భావించే వాళ్లంతా పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నా. ముఖ్యంగా యువత, మహిళలు ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొనాలి. మీ భవిష్యత్ కోసం ఉద్యమకారులు వాళ్ల జీవితాలనే త్యాగం చేశారు. కనుక వారికి మంచి చేసే కార్యక్రమంలో మనమంతా పాల్గొనాలని అన్నారు.



# చేతి నిండా షోస్ సంపాదన, ఎంతంటే?

జబర్దస్త్ ద్వారా బాగా పాపులర్ అయిన వారిలో వర్ష కూడా ఒకరు. ఈ కామెడీ షోలో ఇమ్మాన్యుయేల్ తో ఆమె చేసిన కామెడీ స్కిట్స్, లవ్ ట్రాక్ లు బుల్లితెర ఆడియెన్స్ ను బాగా ఆకట్టుకున్నాయి. కాగా జబర్దస్త్ కంటే ముందు పలు సీరియల్స్ లో యాక్ట్ చేసింది వర్షం. తన గ్లామర్ అండ్ యాక్టింగ్ తో బుల్లితెరపై బాగానే ఫేమస్ అయ్యింది. ఇక జబర్దస్త్ కు వచ్చిన తర్వాత వర్ష రేంజ్, క్రేజ్ అమాంతం పెరిగిపోయాయి. పలు టీవీ షోస్, ప్రోగ్రామ్స్ లో ఈ అమ్మడికి అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ టీవీ షోలతో పాటు హోస్ట్ గానూ రాణిస్తోంది వర్ష. ఓ ప్రముఖ ఛానెల్ లో సెలబ్రిటీ లతో కలిసి టాక్ షో రన్ చేస్తోంది. వీటితో పాటు బయట ఈవెంట్స్, ప్రోగ్రామ్స్ కూడా చేస్తుంటుందీ ముద్దుగుమ్మ. అలాగే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన గ్లామరస్ ఫొటోలు, వీడియోల ను షేర్ చేస్తుంటుంది. మరి చేతినిండా టీవీ షోస్, ప్రోగ్రామ్స్ తో బిజీగా ఉంటోన్న వర్ష నెలకు ఎంత సంపాదిస్తుందో తెలుసా? అని నెటిజన్లు గూగుల్ లో తెగ సెర్చ్ చేస్తున్నారు. కాగా కెరీర్ ప్రారంభంలో తొలి ప్రేమ, ప్రేమ ఎంత మధురం, మట్టి గాజులు, అత్తారిం టికి దారేది వంటి ఫేమస్ సీరియల్స్ లో నటించింది వర్ష. ఆ తర్వాత జబర్దస్త్ లోకి అడుగు పెట్టింది. ఇప్పుడు పలు టీవీ షోల్లో సందడి చేయడంతో పాటు యాంకరింగ్ కూడా చేస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని నివేదికల ప్రకారం వర్ష నెలకు దాదాపు పది లక్షలకు పైగా సంపాదిస్తుందని తెలుస్తోంది. అయితే ఇందులో ఎంత నిజముందో అబద్ధ ముందో తెలియదు కానీ వర్ష రెమ్యునరేషన్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో బాగా హాట్ టాపిక్ గా మారింది.




## ఉద్వేగాల సమ్మేళనం ఇసాకపట్నం

యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన వెబ్ సిరీస్ 'ఇసాకపట్నం'. ప్రతీకారం, అధికారం, కుటుంబ రాజకీయాలు, గ్యాంగ్ వార్ తదితర అంశాల మేళవింపుగా సాగే ఈ వెబ్‌సిరీస్‌లో సముద్రఖని, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రధారులు. గ్యారీ బీహెచ్ దర్శకుడు. రాహుల్ తమడా, సైదీప్ రెడ్డిబొర్రా నిర్మాతలు. జూలై 2 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానున్నది. భావోద్వేగాల సమ్మేళనంగా సాగే థ్రిల్లర్ సిరీస్ ఇదని, ఒక కల్పిత పోర్ట్ టౌన్ చుట్టూ సిరీస్ నడుస్తుందని నిర్మాతలు తెలిపారు. ఐశ్వర్యరాజేష్, సముద్రఖనిల అద్భుత మైన నటన, బీహెచ్ గ్యారీ దర్శకత్వ ప్రతిభ ఈ కథకు మరింత బలాన్ని చేకూర్చాయని ప్రైమ్ వీడియో ప్రతినిధి నిఖిల్మాధోక్ అన్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్‌లో సునీల్, నరేశ్ అగస్త్య, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమకుల, రాజీవ్ కనకాల, మైమ్ రవి, రోహిణి, బెనర్జీ తదితరులు ఇతర పాత్రధారులు.

## అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో 50వ సినిమా



'కరుప్పు' విజయంతో మంచి జోష్ మీదున్నారు తమిళ అగ్ర హీరో సూర్య. ప్రపంచవ్యాప్తంగా మూడొందల కోట్ల పైచిలుకు వసూళ్లను రాబట్టి, సూర్య కెరీర్‌లోనే భారీ విజయంగా 'కరుప్పు' నిలిచిన విషయం విదితమే. సూర్య 46వ సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదల కానున్నది. ఆ తర్వాత జీతూ మాధవన్ దర్శకత్వంలో తన 47వ సినిమా చేస్తారు సూర్య. 'జైభీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్‌తో 48వ సినిమా. పా.రంజిత్‌తో 49వ సినిమా చేయనున్నట్టు తమిళ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఇక మిగిలింది 50వ సినిమా. ఈ ల్యాండ్ మార్క్ మూవీ విషయంలో ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్నది. టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో సూర్య 50వ సినిమా చేయనున్నట్టు వార్తలు బలంగానే వినిపిస్తున్నాయి. ఈ క్రేజీ కాంబోకి సంబంధించిన చర్చలు చివరి దశకు చేరాయని, త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నదని సమాచారం.

## ఒక్క పాటతో సెన్సేషన్.. కట్ చేస్తే.. ఇండియాలోనే అతిపెద్ద డిజాస్టర్..

సినిమా పరిశ్రమలో ఒక సినిమా విడుదల వుతుందంటే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉంటాయి. ప్రమోషన్లు, స్టార్ కాస్టింగ్ వంటివి ఆ సినిమాపై మంచి హైప్ క్రియేట్ చేస్తాయి. అయితే, కొన్ని సినిమాలు ఊహించని విధంగా బాక్సాఫీస్ వద్ద దారుణంగా నిరాశపరుస్తాయి. తాజాగా ఇటువంటి ఒక డిజాస్టర్ బాలీవుడ్ చిత్రం గురించి చర్చ జరుగుతోంది, అదే 'ఆజాద్'. ఈ చిత్రం దాదాపు రూ. 80 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కింది. ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు ఉండటమే కాకుండా, ప్రమోషన్లు కూడా చాలా గ్రాండ్‌గా నిర్వహించారు. అయితే, విడుదల తర్వాత ఈ సినిమా పరిస్థితి దారుణంగా తయారైంది. రూ. 80 కోట్ల వ్యయంతో రూపొందిన ఈ సినిమా, కనీసం రూ. 8 కోట్ల వసూళ్లను కూడా సాధించలేక పోయింది. ఈ చిత్రానికి సంబంధించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి. ఇందులో ప్రముఖ బాలీవుడ్ స్టార్ అజయ్ దేవ్‌గన్ సోదరుడి కుమారుడు అమన్ దేవ్‌గన్ హీరోగా పరిచయం కాగా, రవీనా టాండన్ కూతురు రాషా తదాని హీరోయిన్‌గా డెబ్యూ చేసింది. అం తేకాకుండా, సీనియర్ నటుడు అజయ్ దేవ్‌గన్ ఇందులో కీలక పాత్ర పోషించారు. స్టార్ కిడ్స్ ఎంట్రీ ఇవ్వడంతో సినిమాపై అంచనాలు ఆకా శాన్ని తాకాయి. అయితే, సినిమా థియేటర్లలోకి రాగానే ప్రేక్షకుల నుంచి డిజాస్టర్ టాక్ తెచ్చు కుంది. కథ, కథనం ప్రేక్షకులను ఏమాత్రం ఆక ట్టుకోలేకపోయాయి. సినిమా పరంగా ఘోరంగా విఫలమైనప్పటికీ, ఈ చిత్రంలోని 'ఉయ్ అమ్మా' అనే సాంగ్ మాత్రం సోషల్ మీడియాలో సెన్సేష న్ క్రియేట్ చేసింది. ఇప్పటికీ ఈ పాట ఇంటర్నె ట్‌లో ట్రెండింగ్‌లో ఉండటం విశేషం. భారీ స్టార్ కాస్టింగ్ ఉన్నప్పటికీ, సరైన కంటెంట్ లేకపోతే సినిమాలు ఎలా బోల్తా పడతాయో చెప్పడానికి 'ఆజాద్' ఒక నిదర్శనంగా నిలిచింది. విడుద లకు ముందే రాషా తదాని నటించిన ఉయ్ అమ్మా అనే సాంగ్ సంచలనం సృష్టించినప్పటికీ సినిమా మాత్రం తీవ్ర నిరాశపరిచింది.



# వరుస వివాదాలతో నిత్యం వార్తల్లో.. బిగ్‌బాస్ 10లోకి ఈ కాంట్రవర్సీ సింగర్ ఎంట్రీ ఫిక్స్!



బుల్లితెర ఆడియెన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న బిగ్ బాస్ సందడి మళ్లీ మొదలు కానుంది. ఇప్పటికే 9 సీజన్లు పూర్తి చేసుకు న్న ఈ రియాలిటీ షో పదో సీజన్ త్వరలోనే ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ఇటీవలే అధికారికంగా ప్రోమోను కూడా రిలీజ్ చేశారు. అయితే గత సీజన్ల కంటే ఈ సీజన్ బిగ్ బాస్ మరింత స్పెషల్ గా ఉండనుంది. ఎందుకంటే తెలుగులో రియాలిటీ షో ప్రారంభమై పదేళ్లు గడిచాయి. అందుకే ఈ ల్యాండ్ మార్క్ సీజన్ కోసం దశా వతారం కాన్సెప్ట్ అంటూ బిగ్ బాస్ షోకు మరిన్ని హంగులు అద్దనున్నారు. అలాగే కంటెస్టెంట్ల ఎంపిక విషయంలోనూ మరిన్ని జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో బిగ్ బాస్ పదో సీజన్ కంటెస్టెంట్స్ గా ఎవరు రానున్నారన్న దానిపై సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతోది. ఎప్పటిలాగే ఈసారి కూడా సినీ తారలు, బుల్లితెర సెల బ్రిటీలు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లు, సింగర్లు, కొరియోగ్రాఫర్లు, యాంకర్లు.. ఇలా అన్నీ కేటగిరీల నుంచి బిగ్ బాస్ కం టెస్టెంట్లను ఎంపిక చేయనున్నారు. అలాగే సామాన్యుల కు అవకాశం కల్పించేందుకు బిగ్‌బాస్ తెలుగు అగ్నిపరీక్ష సీజన్ 2 కూడా త్వరలోనే స్టార్ట్ కానుందని సమాచారం.

బిగ్‌బాస్ తెలుగు 10 కంటెస్టెంట్‌స్‌కు సంబంధించి పలువురి పేర్లు తెరపైకి వస్తు న్నాయి. ముఖ్యంగా బుల్లితెర నుంచి పల్లవి గౌడ, తేజస్విని గౌడ, వాసంతి కృష్ణన్ భర్త పవన్ కళ్యాణ్, ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, ఆట సందీప్ భార్య జ్యోతి, నందూస్ వరల్డ్ నందూ, రాయల్ మెక్ రమణ, శివ్, కడలి సత్యనారాయణ, బుల్లితెర స్టార్ ప్రభాకర్ లేదా ఆయన కుమారుడు చంద్రహాస్‌ల పేర్లు బాగా విని పిస్తున్నాయి. అయితే ఇప్పుడు ఉన్నట్లుండి స్టార్ సింగర్ మంగ్లీ పేరు కూడా బిగ్ బాస్ కంటెస్టెంట్ల లిస్టులో ప్రముఖంగా వినిపి స్తోంది. తెలుగులో ఫోక్ సాంగ్స్ కు కేరాఫ్ అడ్రస్ గా మారింది మంగ్లీ. ఇప్పుడు సినిమా పాటలు కూడా ఆలపిస్తోంది. ప్రస్తుతం తెలుగులో ఉన్న టాప్ సింగర్లలో మంగ్లీ కూడా ఒకరని చెప్పవచ్చు. అలాంటి మంగ్లీ గత కొన్ని రోజులుగా వరుసగా వివాదాల్లో చిక్కుకుంటోంది. మరీ ముఖ్యంగా ఇటీవల గోకుల నందన అనే ఇన్‌ఫ్రా సంస్థలో మంగ్లీ, ఆమె సోదరుడు కలిసి దాదాపు 200 కోట్ల రూపాయల స్కామ్‌కి పాల్పడ్డారంటూ సు బ్బారావు అనే న్యాయవాది సంచలన ఆరో పణలు చేశారు. దీనిపై స్పందించిన మంగ్లీ.. ఇవన్నీ నిరాధార ఆరోపణలని తన పరువు, ప్రతిష్టలను దెబ్బతీయడానికే ఇలా కుట్ర చే స్తున్నారని కన్నీళ్లు పెట్టుకుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**